క్లుప్తంగా

మహానందీశ్వరుడి కల్యాణం



కల్యాణోత్సవ పూజలందుకున్న మహానందీశ్వరుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్యధారణ, అక్షితల సమర్పణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం రాత్రి యాగశాలలో మహానందీశ్వరుడి దంపతులకు ఏకాంతసేవ పూజలను నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నీటి సమస్య పరిష్కారం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజరా క్రిష్టారావు పేటలో చేతి పంపు ఏర్పాటుతో రెండు కాలనీలకు నీటి సమస్య తీరిందని సర్పంచు వరప్రసాదరావు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలకు సమీపంలో జలజీవన్ మిషన్ కింద బోరుబావి తవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ నిధులతో నూతన చేతిపంపు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణ్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాములపాడు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. ఎంసీసీలో భాగంగా మంగళవారం మండలంలోని మిట్టకందాల గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని అంతర్గత వీధుల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. అనంతరం గ్రామ సచివాలయంలో సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కోడ్ ఉల్లంఘించి ఎవరైనా ప్రవర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ రామేశ్వర్, పంచాయతీకార్యదర్శి క్రిష్ణప్రియ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమం

మహానంది: వాల్మీకుల సమస్యల పరిష్కారం ఐక్య ఉద్యమాలు అవసరమని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న అన్నారు. అబ్బీపురం, పుట్టుపల్లె, గాజులపల్లె, మహానంది గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలన్న అంశంపై అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. మోసం చేసిన పార్టీలను, నాయకులను దరిచేరనివ్వమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజులపల్లె జయరాం, జిల్లా అధ్యక్షుడు మీనిగ నారాయణ, మండల నాయకులు సుంకులయ్య, రాజు, మద్దిలేటి, అచ్చెయ్య, శీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ మండపం బహూకరణ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంప్రాజెక్ట్‌లో వెలసిన శ్రీరామాలయానికి శ్రీశైలం మండల పద్మశాలీయులు ఉత్సవ మండపాన్ని మంగళవారం బహూకరించారు. అలాగే శ్రీసీతారాముల వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను కూడా సమర్పించారు. పద్మశాలి సంఘం నాయకులు నాగేశయ్య, గోవిందరాజు, శేషగిరి, నాగేశ్వరరావు, నారాయణ, దర్గయ్య, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూరిగుడిసెలు దగ్ధం



అగ్ని ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని 7వ వార్డులో మంగళవారం నాగేంద్రుడు, మురళి, మనోహర్‌లకు చెందిన పూరిగుడిసెలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఎండిన గడ్డికి నిప్పు అంటియించారు. దీంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందాయి. గుడిసెల్లోని బియ్యం, వంట సామగ్రి, డబ్బు కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. నాయకులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఈనెల 18వ తేదీన నామినేషన్ దాఖలు
- భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలి





వెంకటాపురంలో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు, వెలుగోడులో మెకానిక్ కుటుంబాలు

ఆత్మకూరు: ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కోరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలన్నారు. గతంలో 39 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించామని, జరగనున్న ఎన్నికల్లో మళ్లీ 50 వేల ఓట్లకు పైగా భారీ మెజార్టీతో విజయం సాధించాలన్నారు. ఈనెల 18వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల్లోపు నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నామినేషన్ వేసే సమయంలో హంగులు, ఆర్భాటాలు ఏమీ ఉండవని, ప్రశాంతంగా కార్యకర్తల నడుమ నామినేషన్లు వేస్తున్నామని చెప్పారు. కార్యకర్తలు ఆత్మకూరుకు వచ్చి చల్లని దీవెనలు అందించాలని కోరారు. ఈనెల 21వ తేదీ నుంచి శ్రీశైల మహాక్షేత్రం నుంచి ప్రచారం నిర్వహిస్తామని, 23న ఆత్మకూరు మండలంలోని బైర్లూటి నుంచి ఎన్నికల ప్రచారం కొనసాగిస్తామన్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం ఉంటుందని చెప్పారు. ప్రతి గ్రామంలో ఓటర్లకు ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను వివరించి, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, రైతు రుణ మాఫీ, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను వివరిస్తూ ఈనెల 19వ తేదీ నుంచే ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి, శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, పట్టణ, మండలాధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, కుందూరు శివారెడ్డి, రషీద్‌తో పాటు వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

ఆత్మకూరు పట్టణంలో వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు జరిగాయి. మునుపెన్నడూ లేనివిధంగా మంగళవారం పెద్ద సంఖ్యలో టీడీపీని వీడి వందలాది కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి వైసీపీలోకి ఆహ్వానించారు.

- కురుకుంద గ్రామం నుంచి బీసీ కాలనీకి చెందిన 30 మంది యువకులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. షమీర్, ముత్తుజావలి, ఈనూష్, ఇసాక్, బషీర్, రఫిక్, శేఖర్, మాలిక్, ఇమ్రాన్, మద్దిలేటి, మధుతో పాటు పెద్ద సంఖ్యలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, కోట్ల నాగేశ్వర్‌రెడ్డి, మాబాషా, అబ్దుల్‌కలాం, వెంకటేశ్వర్లు, బందెనవాజ్ తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో 100 కుటుంబాల సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వెంకటేశ్వర్లు, స్వామి, విజయ్, అంజాద్‌అలీ, జయకృష్ణ, విజయ్‌చౌదరి, నాగరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూరు పట్టణంలోని 12వ వార్డులో నాయీ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో 120 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి.
- పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కరివేన గ్రామం నుంచి 70 కుటుంబాల సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన రాజేష్, మహేష్, సత్యరాజు, నాగరత్నం, రాజు, రాజన్న, వెంకటేశ్వర్లు తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపాలమ్మ, సురేష్, మహేష్, జయన్న తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకుడు, మాజీ విద్యాకమిటీ చైర్మన్ జయరామిరెడ్డితో పాటు అతని అనుచరులకు చెందిన 20కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. అలాగే రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో షేక్‌మహబూబ్‌బాషా, రహమత్‌బీలతో పాటు 60 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే శిల్పా కండవా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుందూరు శివారెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసే నాయకులను మరువకండి

వెలుగోడు: మంచి చేసే నాయకులను మరిచిపోవద్దని, మంచికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలో 150 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వెలుగోడు పట్టణంలో మెకానిక్ నూరుబాషా ఆధ్వర్యంలో 80 కుటుంబాలు, అబ్దుల్లాపురం గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. అంతకుముందు వెలుగోడు పట్టణంలో యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి నినాదాలతో హోరెత్తించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్లలో శ్రీశైలం నియోజకవర్గం అభివద్ధి పథంలో పయనించిందని, ఏకంగా రూ.వందల కోట్లతో అభివద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ రాఘవ రెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి , ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, దేశం తిరుపం రెడ్డి, మండల కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, గోవిందు, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, ఖాద్రీ, మహ్మద్ ఖాన్, వంగాల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.









శిల్పా కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న రజక సంఘం నాయకులు, నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో.. పార్టీలో చేరిన కురుకుంద గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిన అబ్దుల్లాపురం టీడీపీ నాయకులు

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి



కేజీ రోడ్డుపై పోలీసు కవాతులో జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నందికొట్కూరు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ నుంచి కేజీ రోడ్డుపై పటేల్ సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్, తాలూకాఫీస్ రోడ్డు, పాతబస్టాండ్ వరకు పోలీసు కవాతు నిర్వహించారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో నిర్వహించిన కవాతులో కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందని చెప్పారు. నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఓటు వేసేందుకు ప్రజలకు పోలీసులు ఉండగా ఉంటారని, ఎటువంటి అపోహలకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐలు ప్రకాష్‌కుమార్, విజయభాస్కర్, ఎస్‌ఐలు వెంకటరమణ, నాగార్జున, లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులను సక్రమంగా నిర్వహించండి

ఆత్మకూరు: పోలింగ్ విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయంలో పోలింగ్‌కు సంబంధించిన వస్తువులను, అందుకు కావాల్సిన పత్రాలను ఎలా తీసుకెళ్లాలి, పోలింగ్ ప్రారంభించే సమయంలో, ఓటర్ల ద్వారా ఓటు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఈవీఎం మిషన్‌లను ఎలా పంపాలి తదితర వాటిపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఓ సుధారాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే శిల్పా మల్లికార్జున స్వామివారికి అభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆత్మకూరుకు తిరుగు పయనమయ్యారు. ఎమ్మెల్యే శిల్పా వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్, నాయకులు ఏడుకొండలు, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి నామినేషన్లు

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18 నుంచి ప్రారంభమవుతుందని శ్రీశైలం నియోజకవర్గ ఎన్నికల అధికారి సుధారాణి తెలిపారు. నామినేషన్లు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీల నాయకులు, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నామినేషన్లు ప్రారంభమయ్యే రోజునే రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేస్తున్నందున పట్టణంలో ఎలాంటి విధ్వంసక ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. రెండు పార్టీల నాయకులు ఒకేసారి నామినేషన్లు వేయకుండా తగిన సమయం కేటాయించాలని సూచించారు. పార్టీల నాయకులు సైతం నామినేషన్లు వేసే సమయంలో ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నామినేషన్ల రోజు నుంచి ముగిసేంతవరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు, అధికారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించాలి



కొణిదేలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్

- సంక్షేమం కావాలంటే జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్
- కొణిదేలలో ఇంటింటి ప్రచారం

నందికొట్కూరు రూరల్ : రాష్ట్రంలో ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల నుంచి వృద్ధుల దాకా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగనన్నదే అని అన్నారు. మరింత పటిష్టంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సీఎం జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ పబ్బతి రవి, ఎంపీటీసీ చందమాల సురేష్, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, ఉర్దూ అకాడమి డైరెక్టర్ షకూర్‌మియ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాపరెడ్డి, సత్యంరెడ్డి, కృష్ణారెడ్డి, కొంగర అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీరంగనాథస్వామికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జూపాడుబంగ్లా తహసీల్దారు బాబూ రాజేంద్రప్రసాద్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాలను పురష్కరించుకొని ప్రతి ఏటా స్వామివారు పెళ్లికుమారుడిగా ముస్తాబయ్యే పూలచపురం ఉత్సవం నాడు స్వామి, అమ్మవార్లకు ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా జూపాడుబంగ్లా తహసీల్దారు స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకురాగా.. ఆలయ ఈఓ వెంకటరమణ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను అర్చకులకు అందజేయగా వారు వేదమంత్రాల మధ్య స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌లను ఆలయ ఈఓ శాలువా, పూలమాలలతో సత్కరించగా, అర్చకులు వేదఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మంటలను ఎలా అదుపు చేయాలో వివరిస్తున్న ఫైర్‌సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: అగ్నిప్రమాదాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం సున్నిపెంటలోని ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్ కళాశాలలో ఫైర్ సిబ్బంది ప్రమాదాలను ఎలా నివారించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాధారణంగా ఇళ్లల్లో గ్యాస్‌లీకై మంటలు వ్యాపించినపుడు కంగారు పడకుండా తడిసిన గోనెసంచి లాంటి బట్టను సిలిండర్‌పై కప్పి రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయడం లేదా సిలిండర్‌ను ఆరు బయటకు తీసుకెళ్లాలని సూచించారు. దీని వలన ప్రమాద తీవ్రత తగ్గుతుందని ఫైర్ ఆఫీసర్ పి.అయూబ్‌ఖాన్ వివరించారు.

ఆత్మకూరు: పట్టణంలోని డీపాల్ హైస్కూల్‌లో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిమాపక కేంద్ర అధికారి భీముడునాయక్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు ప్రమాదం జరిగిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కేసులు



బైండోవర్ కేసులు నమోదు చేసినవారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ హరిప్రసాద్

కొత్తపల్లి: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, గ్రామాలలో ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్‌ఐ హరి ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు, సస్పెక్ట్‌లకు, పాత ఎన్నికల కేసులు ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలకు పోకుండా శాంతియుతంగా మెలగాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా 30 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో రౌడీషీటర్లు-6, సస్పెక్ట్‌లు-3, ట్రబుల్ మంగర్ (పాత ఎలక్షన్ కేసులు ఉన్నావారు)-21 ఉన్నారని చెప్పారు.

కనుల పండువగా ప్రభోత్సవం

జూపాడుబంగ్లా: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో శ్రీవీరభద్ర సేవాసమితి సభ్యులు గ్రామంలో ప్రభోత్సవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. బంతి, చేమంతి, గులాబీ పలురకాల పూలతో కూడిన 20అడుగుల ప్రభను ప్రత్యేకంగా అలంకరించి ఎద్దుల బండిపై తప్పెట్లతో గ్రామపురవీధుల్లో ఊరేగించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

నందికొట్కూరు: పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వాల్మీకినగర్, కుమ్మరిపేట, వడ్డెపేట, గాంధీనగర్ కాలనీలలో నీటిసమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆయా కాలనీల్లో ఉన్న బోర్లను రిపేరి చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఉపేంద్ర,భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ మంగళవారం తెలిపారు. కడుమూరు గ్రామానికి బాలరాజు అనే వ్యక్తి మద్యం బాటిళ్లు తీసుకువెళ్తుండగా దాడి చేసి, అతని నుంచి 20 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నీళ్లు తాగేందుకు వెళ్లి ఆవు మృతి



బురదలో ఇరుక్కొని చనిపోయిన ఆవు

కొత్తపల్లి: కృష్ణా నదిలో నీరు తాగేందుకు వెళ్లి ఆవు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బలపాలతిప్ప గ్రామానికి చెందిన తెలుగు గంగమ్మ ఆవులను మేపేందుకు మంగళవారం నదీపరివాహక ప్రాంతానికి వెళ్లింది. మందలోంచి ఓ ఆవు దాహం తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని కృష్ణా నదిలోకి వెళ్లింది. దాహం తీరిన తర్వాత బయటికి వచ్చే క్రమంలో నదిలోని బురద నీటిలో ఇరుక్కుపోయింది. అదిచూసి మిగతా ఆవులు భయపడి బయటికి పరుగులు తీశాయి. గమనించిన యజమాని వచ్చేలోపు ఆవు చనిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

119 మంది వలంటీర్ల రాజీనామా





రాజీనామా అందజేస్తున్న బండిఆత్మకూరు మండల వలంటీర్లు, బొల్లవరం వలంటీర్లు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మంగళవారం బండిఆత్మకూరు మండలం రామాపురం, శింగవరం, సోమయాజులపల్లె, బండిఆత్మకూరు, కాకనూరు, పరమటూరు తదితర గ్రామాల్లో మొత్తం 52 మంది వలంటీర్లు రాజీ నామాలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని జేపీ కిరణ్, కార్యదర్శి సుజాతలకు రాజీనామా పత్రాలను అందించారు. దీంతో పాటు మహానంది మండలంలో గాజులపల్లె-1 నుంచి 14, గాజులపల్లె-2 సచివాలయం నుంచి 10 మంది, అబ్బీపురంలో పది, బుక్కాపురంలో ఏడుగురు, తమ్మడపల్లెలో ఏడుగురు, గోపవరం ఒకరు కలిపి మొత్తం 62 మంది రాజీనామాలను సమర్పించినట్లు మహానంది ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలి పారు. ఈ మేరకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు అప్పగించాలని వలంటీర్లకు అధికారులు సూచించారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శ్రీనివాసులు నాయుడు

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఈఓఆర్డీ నాగేంద్రయ్య అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి జి. శ్రీనివాసులు నాయుడు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి వచ్చే నిధులు, నిర్వహణపై ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం, జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్, ఉపాధి హామీ, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధులు మంజూరు అవుతాయని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, సమతయశోదర, వీరన్నయాదవ్, కాసీంబాషా, జావేద్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయండి



వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఏపీఓ రేష్మ

కొత్తపల్లి: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలని ఏపీఓ రేష్మ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయం పరిధిలోని బండినాయిని పాలెం గ్రామ శివారుల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనదారులకు కొలతలు ఇవ్వాలని సూచించారు. వేతనదారులు కూడా సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే కనీస వేతనం రూ.300 వర్తిస్తుందన్నారు. మండలంలో ప్రభుత్వం 3,800 టార్గెట్ ఇచ్చిందని, ప్రస్తుతం మండలంలో ప్రతి రోజు 5,280 మందికి పైగా పనులు కల్పిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ మజహర్, ఫీల్డ్‌అసిస్టెంట్ కళ్యాణ్‌కుమార్ ఉన్నారు.